


PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక: 48 ఎడిటర్: రాపోలు లింగస్వామి 18-10 -2026 ఆదివారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00

## బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి ప్రతీక

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రకృతి, ఆడబిడ్డల ఆరాధనకు బతుకమ్మ నిలువెత్తు నిదర్శనమని తెలిపారు.సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రజలకు, ఆడబిడ్డలకు ముఖ్యమంత్రి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి, పూలను పూజించే గొప్ప సంస్కకతికి తెలంగాణ నెలవని పేర్కొన్నారు. తీరొక్క పూలతో చేసిన ఘనమైన బతుకమ్మలతో ఆడబిడ్డలందరూ ఆటపాటలతో సద్దుల బతుకమ్మ సంబురాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ పూల పండుగ ప్రతి ఇంటా ఆనందాల పూలవాన కురిపించాలని,ప్రతి కుటుంబంలో సిరిసంపదలు,



సుఖశాంతులు వెల్లివిరియాలని, తెలంగాణ సంస్కృ?కతి వైభవం తరతరాల పాటు నిలవాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ పండుగ ప్రజల సాంస్కృ?కతిక వైభవం, మహిళల ఐక్యతను చాటిచెప్పడంతో పాటు అనేక సామాజిక అంశాలతో నిండి ఉందన్నారు.రాష్ట్రం అంతటా బతుకమ్మ పండుగను 9 రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించుకోవడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో ఆడబిడ్డలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రజా ప్రభుత్వం అందజేస్తూ ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

## తెలంగాణలో భూసమగ్ర సర్వేపై మంత్రి పొంగులేటి సమీక్ష..

హైదరాబాద్, అక్టోబర్ 17: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూసర్వేపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు భూ రీసర్వేలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సర్వేకు ముందు భూ యజమానులకు నోటీసులు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములు, గ్రామకంఠాల హద్దులపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.'రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించే లక్ష్యంతో ప్రభుత్వం సమగ్ర సర్వేను చేపట్టింది. మూడు



దశల్లో ఈ భూసర్వే కొనసాగుతుంది. వచ్చే నెలాఖరులోగా తొలిదశ సర్వే పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నాం. తొలి దశలో భాగంగా ఇప్పటికే 2,720 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి అయింది. సర్వేలో భాగంగా ప్రతి భూకమతానికి కచ్చితమైన హద్దులు నిర్ణయిస్తున్నాం. అనంతరం ప్రతి సర్వేనెంబర్‌కు ప్రత్యేక భూదార్ ఐడీని కేటాయిస్తున్నాం. ఆధునిక సాంకేతికతతో భూముల కొలతలు తీసుకుని డిజిటల్ రూపంలో వివరాలను భద్రపరుస్తున్నాం. ఈ వివరాలన్నింటినీ భూ భారతి పోర్టల్‌లో నమోదు చేస్తున్నాం. ఈ మేరకు భూయజమానులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తాం. పాలేరు నియోజకవర్గంలో త్వరలో భూదార్ పట్టాల పంపిణీ చేస్తాం. కాగా, నేలకొండపల్లి మండలం కొంగరలో 665 ఎకరాల్లో వందశాతం రీసర్వే పూర్తి అయింది' అని మంత్రి పేర్కొన్నారు.

## దసరా, బతుకమ్మ పండుగల ఎఫెక్ట్..

దసరా, బతుకమ్మ పండగల నేపథ్యంలో జనాలు హైదరాబాద్ నుంచి




సొంతూళ్లకు వెళ్తుండటంతో రాష్ట్రంలో పలు ప్రధాన రహదారులు రద్దీగా మారిపోయాయి. ప్రయాణికులు వెళ్తున్న వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ అవుతోంది. సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో వెళ్తున్న వాహనాలు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ జాతీయ రహదారి 65పై పంతంగి టోల్ ప్లాజా వద్ద భారీగా నిలిచిపోయాయి.పండుగల నేపథ్యంలో రద్దీ మరింత ఎక్కువగా పెరుగకముందే ట్రాఫిక్ పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాల వెంబడి వాహనాలు పంపిస్తూ ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు. చౌటుప్పల్ ఫ్లైఓవర్ల నిర్మాణంతో సర్వీసు రోడ్డుపై వాహనాలు నెమ్మదిగా ముందుకు కదులుతున్నాయి.ఫాస్టాగ్ బ్యాలెన్స్ లేకపోవడం, సాంకేతిక సమస్యలు కూడా టోల్ ప్లాజా వద్ద రద్దీకి మరో కారణం అని అధికారులు చెబుతున్నారు. ఇక రద్దీని దృష్టిలో ఉంచుకొని చౌటుప్పల్ పరిధిలోని లక్కారం నుంచి వలిగొండ మార్గం మీదుగా చిట్యాలకు చేరుకునేలా వాహనాలను ట్రాఫిక్ పోలీసులు దారి మళ్లిస్తున్నారు. మరోవైపు పంతంగి టోల్ ప్లాజా వద్ద విజయవాడవైపు వెళ్లే వాహనాలు భారీ సంఖ్యలో టోల్ ప్లాజా వద్ద ఆగాయి.

## యువ ప్రతిభను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం

**– షార్ట్ ఫిలిమ్స్ ద్వారా సామాజిక చైతన్యం కల్పించాలి**

**– తెలంగాణ యువ ఫిల్మ్ మేకర్స్‌కు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపు**

శనివారం శిల్పకళా వేదిక నందుతెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్ 2026" కార్యక్రమానికి గౌరవ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో యువతలో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికితీసి, వారిని ప్రోత్సహించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. తెలంగాణ ఫిల్మ్ మేకర్స్ అవార్డుల కార్యక్రమం యువ దర్శకులు, సృజనాత్మక కళాకారులకు తమ ప్రతిభను చాటుకునేందుకు గొప్ప వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా ప్రముఖ చలనచిత్ర నిర్మాణ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నేతృత్వం లో సినీ పరిశ్రమ అభివృద్ధికి, స్థానిక యువ ప్రతిభకు తగిన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.రెండు నుంచి మూడు నిమిషాల నిడివి గల షార్ట్ ఫిలిమ్స్ ద్వారా ఒక కథను ప్రేక్షకులకు అర్థమయ్యేలా చెప్పడం ఎంతో సృజనాత్మకతతో కూడుకున్నదని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువ ఫిల్మ్ మేకర్స్ పాల్గొనడం అభినందనీయమని పేర్కొంటూ, ప్రస్తుతం అవార్డులు పొందని వారు నిరుత్సాహపడకుండా మరింత ప్రతిభను మెరుగుపరుచుకోవాలని సూచించారు.భవిష్యత్తులో గొప్ప దర్శకులుగా,నిర్మాతలుగా ఎదిగే యువతకు రాష్ట్ర ప్రభుత్వంఅవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.సామాజిక సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు షార్ట్ ఫిలిమ్స్‌ను సమర్థవంతమైన మాధ్యమంగాఉపయోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తలెత్తే వర్షాభావ పరిస్థితులు, తాగునీటి కొరత,పెరుగుతున్న ఉష్ణోగ్రతలు వంటి సమస్యలపై ప్రజలను అప్రమత్తం చేసేలా యువ దర్శకులు సందేశాత్మక చిత్రాలను రూపొందించాలని కోరారు. మనుషులు, పశువులు, పక్షులకు అవసరమైన నీటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, నీటి పొదుపు, విద్యుత్ పొదుపుపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు.వాతావరణ మార్పుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, విద్యుత్ వినియోగం కూడా గణనీయంగా పెరుగుతోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రానున్న నెలల్లో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సృజనాత్మకతతో రూపొందించే ఒక చిన్న చిత్రం



కూడా సమాజంపై గొప్ప ప్రభావాన్ని చూపగలదని, యువ ఫిల్మ్ మేకర్స్ తమ ప్రతిభను సామాజిక ప్రయోజనాలకు వినియోగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న యువ కళాకారులందరికీ ఉప ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేస్తూ, వారి సృజనాత్మక ప్రయత్నాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలోని రంగుల మాదిరిగానే యువత జీవితాలు కూడా విజయాలతో విరబూయాలని ఆకాంక్షిస్తూ దసరా శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు దయానంద్, శాసన సభ్యులు నవీన్ యాదవ్, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, జ్యూరీ సభ్యులు వెన్నెల గద్దర్, విమలక్క, ఇతర సినీ ప్రముఖులు, కళాకారులు, యువ ఫిల్మ్ మేకర్స్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

**– రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి




సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ.లు, ఎన్నికల విభాగం అధికారులతో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై సమీక్ష సమావేశంనిర్వహించారు ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ఎ.ఈ.ఆర్.ఓ.లు తమ పరిధిలోని బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్ల తో సమన్వయం చేసుకుంటూ ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసే విధంగా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా కొనసాగేందుకు సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అక్టోబర్ 1వ తేదీ ప్రామాణికంగా 18 సంవత్సరాలు నిండిన, అర్హత గల ప్రతి ఒక్క ఓటరు వివరాలు జాబితాలో తప్పనిసరిగా ఉండాలని, అనర్హుల వివరాలు ఖచ్చితంగా ఉండకూడదని తెలిపారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న ఇంచార్జి జిల్లా కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నిర్వహించడం జరుగుతుందని, పెండింగ్ లో ఉన్న ఫారం 6, 7, 8 పరిష్కారం, నోటీసుల జారీ ప్రక్రియను నిబంధనల ప్రకారం సక్రమంగా నిర్వహించడం, ఓటర్ల నుండి సేకరించిన ధ్రువ పత్రాలను నిబంధనల మేరకు పరిశీలించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదా దేవి, కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## బకాయిల బందిఖానాలో ఖజానా

వేల కోట్ల పెండింగ్ బిల్లులతో ఉద్యోగుల కన్నీళ్లు..న్యాయం కోసం సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు! గ్రాట్యుటీ, జీపీఎఫ్, సరెండర్ లీవులు, రిటైర్మెంట్ ప్రయోజనాల కోసం ఎదురుచూపులు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాల్సిన ప్రభుత్వం..ప్రజలకు సేవలందించే ఉద్యోగుల సమస్యలను కూడా సకాలంలో పరిష్కరించలేకపోతే పరిపాలనా వ్యవస్థపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతాయి. రాష్ట్రంలో ప్రస్తుతం రెగ్యులర్ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న పెండింగ్ బిల్లుల సమస్య ఇలాంటి పరిస్థితినే ప్రతిబింబిస్తున్నది.ఏండ్ల తరబడి ప్రభుత్వానికి సేవలందించిన ఉద్యోగులు తమకు చట్టబద్ధంగా అందాల్సిన రిటైర్మెంట్ ప్రయోజనాల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతుండగా, మరోవైపు తమ బిల్లుల చెల్లింపుల కోసం కాంట్రాక్టర్లు ఎదురుచూస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించాల్సిన ఆర్థిక శాఖను సంప్రదించేందుకు ప్రయత్నిస్తున్న బాధితులకు ఎదురవుతున్న ఆంక్షలు,నిరీక్షణ,నిరాశ ప్రభుత్వ పాలనా తీరుపై చర్చకు దారితీస్తున్నాయి.ఉద్యోగుల గ్రాట్యుటీ, జీపీఎఫ్, సరెండర్ లీవులు, టీజీఎల్ఐ, గ్రూప్ ఇన్సూరెన్స్, అడ్వాన్స్ బిల్లులు, ఇతర రిటైర్మెంట్ ప్రయోజనాలకు సంబంధించిన బకాయిలు వేల కోట్ల రూపాయలకు చేరినట్లు ఉద్యోగ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఉద్యోగ విరమణ చేసిన తర్వాత కుటుంబ అవసరాలు,వైద్య ఖర్చులు, పిల్లల చదువులు,గృహ రుణాలు,ఇతర ఆర్థిక బాధ్యతలను నిర్వహించాల్సిన సమయంలో తమకు రావాల్సిన సొమ్ము అందకపోవడం వారిని తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నది.రాష్ట్ర ఆదాయాలు, వ్యయాలు, బడ్జెట్ కేటాయింపులు, ప్రభుత్వ బిల్లుల చెల్లింపులు, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే ఆర్థిక శాఖ ప్రజలకు, బాధితులకు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం ఉన్నది.బాధితులకు న్యాయం చేయడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత. బకాయిలు చెల్లింపుపై స్పష్టత ఇవ్వడం, వినతులను స్వీకరించడం, ఫైళ్ల స్థితిని తెలియజేయడం, నిర్ణీత గడువులో పరిష్కారం చూపడం వంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉన్నది.జిల్లాల నుంచి హైదరాబాద్ వస్తున్న ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు తమకు రావాల్సిన బకాయిల కోసం ఎన్నో ఆశలతో సచివాలయానికి చేరుకుంటారు. తమ సమస్యను సంబంధిత అధికారికి వివరించి, ఫైల్ ఎక్కడ ఆగిపోయిందో తెలుసుకొని, ఎప్పుడు డబ్బులు వస్తాయో స్పష్టత పొందాలని కోరుకుంటున్నారు. కానీ కార్యాలయాల్లోకి వెళ్లేందుకు అనుమతి లభించకపోవడం, సంబంధిత అధికారులను కలిసే అవకాశం లేకపోవడం తమకు మరింత ఇబ్బందిగా మారిందని వారు చెప్తున్నారు. కొన్ని సందర్భాల్లో కార్యాలయ సిబ్బంది బయటకు వచ్చి వినతిపత్రాలను స్వీకరిస్తున్నారని బాధితులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా పదవీ విరమణ చేసిన రిటైర్డ్ ఉద్యోగులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు రాకుండా ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాటు చేయడం తక్షణావసరం. పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం కాంట్రాక్టర్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం విశ్రాంత ఉద్యోగులు, ఇతర ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రభుత్వ సిబ్బంది ఆర్థికశాఖను ఆశ్రయిస్తున్నారు. కొందరికి టోకెన్లు ఇచ్చినా, సమస్యలు పరిష్కారం కావడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఫైళ్లను పరిశీలించే అధికారులకు అవసరమైన అధికారాలు, నిధుల విడుదలపై నిర్ణయాలు తీసుకునే స్థాయిలో సమన్వయం, బాధితులకు జవాబుదారీతనం ఉండాలి. సర్వీసులో ఉన్నప్పుడు జీతం ద్వారా కుటుంబాన్ని నడిపించిన వ్యక్తి, రిటైర్మెంట్ తర్వాత తన సొంత డబ్బు కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగాల్సి రావడం బాధాకరం. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రభుత్వానికి ఇష్టమొచ్చినప్పుడు చెల్లించే అదనపు సాయం కాదు. వర్తించే నిబంధనలు,అర్హతల ప్రకారం ఉద్యోగికి అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు.అందువల్ల బకాయిల చెల్లింపులో పారదర్శకత, సమయపాలన, బాధితులకు స్పష్టమైన సమాచారం ఉండాలి.ప్రతి నెలా సుమారు 500 మంది ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేస్తున్నారు. వారికి అవసరమైన రిటైర్మెంట్ ప్రయోజనాల కోసం నెలకు సుమారు రూ.200 కోట్ల నుంచి రూ.250 కోట్ల వరకు నిధులు అవసరమవుతున్నాయి. ఒకవైపు పాత బకాయిలు చెల్లించాల్సి ఉండగా, మరోవైపు కొత్తగా ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులకు ప్రయోజనాలు అందించాలి. ప్రస్తుత బకాయిల పరిష్కారానికి తగిన మొత్తంలో నిధులు విడుదల చేయకపోతే, పాత బకాయిలు తగ్గకపోగా కొత్త బకాయిలు పేరుకుపోయే ప్రమాదం ఉన్నది. 2027 మార్చి నాటికి బిల్లుల బకాయిలను గణనీయంగా తగ్గించాలంటే నెలకు సుమారు రూ.2,000 కోట్ల మేర నిధుల విడుదల అవసరం. ఈ అంచనాకు సంబంధించిన మొత్తం బకాయిలు, ఇప్పటికే చెల్లించిన మొత్తాలు, కొత్తగా చేరుతున్న బిల్లులు, ఇతర ఆర్థిక బాధ్యతల వివరాలను ప్రభుత్వం అధికారికంగా వెల్లడించాలి.జిల్లా పరిషత్ జీపీఎఫ్ ఫైనల్ పేమెంట్లు, కమ్యూటేషన్, రిటైర్డ్ ఉద్యోగుల ఇతర ప్రయోజనాల చెల్లింపులు జరిగినట్లు కొన్ని వర్గాలు చెప్తున్నాయి. కమ్యూటేషన్ చెల్లింపుల్లో పురోగతి ఉన్నప్పటికీ, మిగిలిన బకాయిలపై ఉద్యోగులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉన్నది. ఏ విభాగానికి ఎంత చెల్లించారు? ఏ బకాయిలు ఇంకా మిగిలి ఉన్నాయి? ఏ ప్రాతిపదికన చెల్లింపులకు ప్రాధాన్యత ఇస్తున్నారు? అనే వివరాలను ప్రభుత్వం బహిరంగపరచాలి. ప్రతిసారీ నిధుల కొరతను కారణంగా చూపితే, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు లభిస్తుంది? ఆర్థిక క్రమశిక్షణ పేరుతో ఉద్యోగులకు చెల్లించాల్సిన ప్రయోజనాలను నిరవధికంగా వాయిదా వేయడం సరైన విధానం కాదు.

# హయత్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ

### సేవా కార్యక్రమాల్లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ విజన్ బిల్డర్స్ ముందంజ



జ్యోతి ప్రభంజనం, హయత్‌నగర్, ప్రతినిధి:సామాజిక సేవే లక్ష్యంగా ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ విజన్ బిల్డర్స్ ఆధ్వర్యంలో శనివారం హయత్‌నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్లతో పాటు వైద్య సేవల కోసం వచ్చిన ఔట్‌పేషెంట్లకు పండ్లు పంపిణీ చేసి సేవాభావాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు గూడూరు అంజిరెడ్డి మాట్లాడుతూ సమాజంలోని సమస్యల పరిష్కారానికి, యువతలో సేవాభావాన్ని పెంపొందించడానికి, సమాజ అభివృద్ధికి ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం, సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి మేలు చేయడం సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.అనంతరం డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో స్వచ్ఛంద సేవా సంస్థలు భాగస్వాములు కావాలని కోరారు. ముఖ్యంగా ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులు కూర్చునేందుకు వీలుగా బెంచీల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.క్లబ్ కార్యదర్శి నందికొండ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో భాగస్వాములై సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. సేవా కార్యక్రమాల ద్వారా ఆపదలో ఉన్నవారికి



అండగా నిలిచి, సమాజంలో మానవతా విలువలను పెంపొందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ గోపాల్, డాక్టర్ కళ్యాణి (గైనకాలజిస్ట్), క్లబ్ ట్రెజరర్ బాలు చౌహాన్, బెలిదే శ్రీకాంత్, లావుడి వీర, వెంకటేశం గౌడ్, గుత్తా ప్రవీణ్ రెడ్డి, బానోతు శ్రీనివాస్, మెరుగు శ్రవణ్, గజ్జల శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పంతం!



ప్రత్యర్థులు ఎవరైనా ఎదురొచ్చినా,
పరిస్థితులు ఎన్ని పరీక్షలు పెట్టినా,
గమ్యం చేరాలనే సంకల్పం ఉంటే,
గుండెలో ధైర్యం కొండంత ఉండాలి!
అడుగడుగునా అడ్డంకులు ఎదురైనా,
అనుకున్న దారిలో అవరోధాలు నిలిచినా,
పట్టు విడవని మనసుకు ఓటమి లేదు,
ప్రయత్నం ఆపని వాడికి అంతం లేదు!
కాలం కలిసిరాక కష్టాలు చుట్టుముట్టినా,
కన్నవారే కాదన్నా, లోకం కాదన్నా,
నమ్ముకున్న లక్ష్యం నీడలా వెంటుంటే,
నిలువెత్తు ధైర్యం నీలో నిలవాలి!
గెలుపు తలుపులు వెంటనే తెరుచుకోవు,
విజయం పూలబాటై ఎదురురాదు,
చెమట చుక్కలే రేపటి విజయ తిలకాలు,
పట్టుదలే చరిత్రను మార్చే ఆయుధం!
ప్రత్యర్థి బలాన్ని చూసి వెనకడుగు వేయకు,
ప్రతికూల పరిస్థితులకు తలవంచకు,
నీ ఓర్పును బలహీనతగా భావించనివ్వకు,
నీ మౌనమే నీ విజయానికి పునాది కానివ్వు!
పంతం పట్టడం అంటే పగను పెంచడం కాదు,
పట్టుకున్న లక్ష్యాన్ని సాధించి చూపడం!
ఎన్ని ఎదురుదెబ్బలు తగిలినా నిలబడాలి,
ఎన్ని అడ్డంకులు వచ్చినా ముందుకు సాగాలి!
పట్టు వదలని సంకల్పంతో పోరాడాలి,
చివరకు నీ పంతాన్ని విజయంగా మలచాలి!

**రచన : కె.మురళీమోహన్ రాజు,**
**నెల్లూరు.చరవాణి : 9866179385**

# తెలంగాణ ప్రజా చైతన్య సమితి రంగారెడ్డి జిల్లా కార్మిక సంఘం అధ్యక్షుడిగా వడ్డే వెంకటేష్

### ప్రజలు చైతన్యవంతులైనప్పుడే హక్కుల సాధన సాధ్యం

రంగారెడ్డి, జ్యోతి ప్రభంజనం,అక్టోబర్ 17: తెలంగాణ ప్రజా చైతన్య సమితి రంగారెడ్డి జిల్లా కార్మిక సంఘం అధ్యక్షుడిగా వడ్డే వెంకటేష్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రజా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు నర్సింలు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా రాపోలు నర్సింలు మాట్లాడుతూ ప్రజల్లో సామాజిక, హక్కులపట్ల చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు చైతన్యవంతులైనప్పుడే తమ హక్కులను తెలుసుకొని,



వాటిని సాధించుకోగలుగుతారని పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాజు, సామ కర్ణాకర్ రెడ్డి, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

# మనిషి మిగిల్చే గాయం



వ్యసనాలకు అలవాటు పడినా ఎలాగోలా బయటపడగలం,
కానీ ఒక మనిషికి అలవాటు పడితే మనల్ని మనమే కోల్పోతాం!
ప్రతిరోజూ పలకరించే మాటకు మనసు బానిసైపోతుంది,
క్షణక్షణం వినిపించే గొంతు కోసం గుండె నిరీక్షణలో కరిగిపోతుంది!
ఒక్కరోజు కనిపించకపోతే వేల ఆలోచనలు చుట్టుముడతాయి,
ఒక్కమాట మాట్లాడకపోతే వంద ప్రశ్నలు గుండెను తొలిచేస్తాయి!
అలవాటైన మనిషి దూరమైతే అంతా శూన్యంగా కనిపిస్తుంది,
నవ్వుతూ తిరిగే పెదవుల వెనుక నిశ్శబ్దపు యుద్ధం మొదలవుతుంది!
వ్యసనం శరీరాన్ని బంధిస్తే మనిషిపై ప్రేమ మనసును బంధిస్తుంది,
వ్యసనాన్ని వదిలే మార్గం దొరకొచ్చు మనిషిని మరిచే దారి దొరకదు!మాటలు ఆగిపోయినా జ్ఞాపకాలు ఆగవు,
బంధాలు తెగిపోయినా భావాలు చావవు,
దూరాలు పెరిగిపోయినా ఆశలు చావవు,
కాలం గడిచినా గాయాలు మానవు!
అందుకే మనసిచ్చే ముందే ఆలోచించాలి, మనిషిని ప్రేమించాలి..
కానీ మన ఉనికిని మనమే మరిచిపోకూడదు!

**రచన : ఆర్.కె.రెడ్డి గోగులపల్లి, నెల్లూరు జిల్లా.**

# రైతు కన్నీరు ? పాలకుల తీరు

మద్యం సీసాలు దుకాణాల్లో దర్శనమిస్తాయి,
యువత భవిష్యత్తును చీకటిలోకి నెడతాయి!



రైతుకు ప్రాణమైన ఎరువులేమో,
బుకింగ్ యాప్‌లో బందీలైపోతాయి!
యువతను చెడగొట్టే విషం సులభంగా దొరుకుతుంది,
దేశానికి అన్నం పెట్టే బలం మాత్రం క్యూలో నిలుస్తుంది!
మత్తుకు మార్గాలు ముంగిటే కనిపిస్తాయి,
వ్యవసాయానికి అవసరాలు అడ్డంకుల్ని ఎదుర్కొంటాయి!
మద్యం అమ్మకాలకు లెక్కలేనన్ని దారులు,
ఎరువుల కోసం రైతుకు అంతులేని ఎదురుచూపులు!
తాగేవాడి చేతికి సీసా వెంటనే చేరుతుంది,
పండించే రైతు చేతికి ఎరువు ఆలస్యంగా చేరుతుంది!
ఒకటి కుటుంబాలను కన్నీటిలో ముంచుతుంది,
మరొకటి కోట్ల కడుపులకు అన్నం పెడుతుంది!
ఏది సులభంగా దొరకాలి ఈ సమాజంలో?
ఏది అందుబాటులో ఉండాలి రైతు జీవితంలో?
రైతు చెమట చుక్కే మన ఆకలికి సమాధానం,
ఆ రైతు కష్టమే దేశానికి అసలైన ధనాగారం!
అన్నం పెట్టే చేతికి అడ్డంకులెందుకు?
అడుగడుగునా ఆంక్షలతో అవస్థలెందుకు?
మత్తుకు ప్రాధాన్యమా.. మట్టికి అవమానమా?
రైతు కన్నీటికి లేదా పాలకుల దృష్టిలో విలువా?
మద్యం సీసాలకన్నా ఎరువులే ముందుగా చేరాలి,
రైతు బతికితేనే దేశపు ఆకలి తీరాలి!

**రచన : కె.మురళీమోహన్ రాజు,**
**నెల్లూరు.చరవాణి : 9866179385**

# దుర్గామాత మండపాల్లో డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత ప్రత్యేక పూజలు

**రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్థిల్లాలని అమ్మవారికి ప్రార్థన**

రంగారెడ్డి, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి,అక్టోబర్ 17:దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి శనివారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బాలాపూర్, బడంగ్‌పేట్, అల్మాన్‌గూడ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజల జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని దుర్గామాతను ప్రార్థించారు. శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిభావంతో, ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్న నేపథ్యంలో అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆకాంక్షించారు. ఈ పూజా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, నిరుడు శ్రీరాములు, రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, గట్టు బాలకృష్ణ, బోయపల్లి వెంకట్ రెడ్డి, దిండు శ్రీనివాస్ గౌడ్, బొల్లపల్లి కుమార్, టేకుల శశిధర్ రెడ్డి, ఎదుల్ల ప్రతాప్ రెడ్డి, రామిడి శ్రీనివాస్ రెడ్డి, తూళ్ళ నరహరి గౌడ్, అమృత నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# నాగోల్‌లో మహిళ అదృశ్యం.. ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వండి

**ప్రజలకు నాగోల్ పోలీసుల విజ్ఞప్తి**

జ్యోతి ప్రభంజనం, హైదరాబాద్, అక్టోబర్ 17:నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ అదృశ్యమయ్యారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని నాగోల్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగోల్‌లో నివాసముంటున్న దీపక్ కుమార్ (29) తల్లి రాయ్ కుమారి (53) ఈ నెల 14వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె కుమారుడు అక్టోబర్ 17న నాగోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.సుమారు రెండు నెలల క్రితం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మెయిన్‌పురి జిల్లాలో ఉన్న తమ స్వగ్రామం నుంచి రాయ్ కుమారిని హైదరాబాద్‌లోని నాగోల్‌లో నివసిస్తున్న కుమారుడి ఇంటికి తీసుకువచ్చారు. ఈ నెల 14వ తేదీన ఉదయం దీపక్ కుమార్ పనికి వెళ్లి, మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో భోజనం కోసం ఇంటికి వచ్చి తిరిగి పనికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి తల్లి కనిపించలేదు.ఆమె మొబైల్‌కు ఫోన్ చేయగా, తాను బయటకు వెళ్తున్నానని చెప్పి ఫోన్ కట్ చేసినట్లు కుమారుడు పోలీసులకు తెలిపాడు. అనంతరం పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ మొబైల్ స్విచ్ ఆఫ్ రావడంతో ఆందోళనకు గురయ్యాడు. స్వగ్రామంలోని బంధువులను సంప్రదించగా, ఆమె అక్కడికి కూడా చేరుకోలేదని తెలిసింది.దీంతో బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసి, అదృశ్యమైన మహిళ ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు.రాయ్ కుమారి ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా నాగోల్ పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని పోలీసులు కోరారు.



# దేవి శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు

**కుత్బుల్లాపూర్ నుంచి బొంతపల్లి వరకు పలు అమ్మవారి మండపాల్లో పూజలు నిర్వహించిన బీజేపీ నాయకుడు చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి**



కుత్బుల్లాపూర్, జ్యోతి ప్రభంజనం,ప్రతినిధి, అక్టోబర్ 17: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వెంకటేశ్వర నగర్, గణేష్ నగర్, డీ నగర్ (చింతల్), ద్వారకా నగర్, అంబేద్కర్ నగర్, రాఘవేంద్ర కాలనీలలో కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలను ఆయన సందర్శించారు. శరన్నవరాత్రుల ఏడవ రోజు శ్రీ లక్ష్మీదేవి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. ప్రతి కుటుంబంపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని, సమాజంలో సుఖశాంతులు, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అనంతరం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని బొంతపల్లి వీరభద్ర నగర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని సందర్శించి, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు, కాలనీవాసులతో కలిసి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు.

# రైతుల పంటలకు 'శంకర' కవచం

**అన్నదాతకు అండగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**
**శంకరన్న మాట రేవంతన్న భరోసా**
**పంటలకు మూడు గంటల అదనపు విద్యుత్ .. రైతులకు పెద్ద ఊరట**
**షాద్‌నగర్ డివిజన్ లో 112 మెగావాట్ల డిమాండ్..**
**రైతుల కోసం ప్రత్యేక విద్యుత్ చర్యలు**
**40 వేల వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ భరోసా**
**భూగర్భ జలాలు తగ్గినా.. పంటలకు కరెంటు కొరత లేకుండా చర్యలు**
**ఎల్‌నినో దెబ్బకు కరెంటు భారం.. రైతులకు అండగా శంకరన్న ప్రత్యేక చర్యలు**



ఎల్‌నినో ప్రభావం కారణంగా ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు అన్నదాతలను కుంగదీశాయి. పంట పొలాలపై తీవ్ర ప్రభావం చూపాయి. ఇదే క్రమంలో విద్యుత్ సమస్య కూడా తీవ్రం కావడంతో పంటలకు సకాలంలో నీరు వదలలేక రైతులు విలవిలలాడారు. ఈ సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రంగంలోకి దిగారు. రైతులకు అదనంగా మూడు గంటల విద్యుత్‌ను అమలు చేయాలంటూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడమే కాకుండా, నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి అదనంగా విద్యుత్ అమలు చేయాలని కోరారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విజ్ఞప్తిపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించి ఏకంగా రాష్ట్రవ్యాప్తంగా ఇదే విధానం అమలు అయ్యేలా చర్యలు తీసుకున్నారు. రైతులకు సకాలంలో విద్యుత్ అందించకపోతే ఉద్యోగాలు తొలగించే పరిస్థితి వస్తుందని అధికారులకు కఠినంగా హెచ్చరికలు చేయడంతో విద్యుత్ సమస్య క్రమంగా తీరింది. ఈ సమస్య పరిష్కారంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవ కీలకంగా నిలిచిందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం సకాలంలో విద్యుత్ సరఫరా అందుతుండటంతో రైతులు పంటలకు నీటిని అందించగలుగుతున్నారు. దీంతో పంటలు నిలబడటంతో షాద్‌నగర్ నియోజకవర్గ రైతులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు చెబుతున్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాలనలో తనదైన ముద్ర వేస్తూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రైతులకు అత్యంత కీలకమైన విద్యుత్ సమస్యను నేరుగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం ప్రశంసనీయం అని రైతులు అంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను పక్కన కూర్చోబెట్టుకొని మీడియా సమావేశంలో మాట్లాడడం కూడా విశేషంగా నిలిచింది. 40 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు.. 112 మెగావాట్ల డిమాండ్ షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 40,000 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం వీటికి సమృద్ధిగా విద్యుత్ అందించాలంటే 112 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉంది. ఎల్‌నినో ప్రభావం వల్ల భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడంతో విద్యుత్ వినియోగ భారం కూడా పెరిగింది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు షాద్ నగర్ విద్యుత్ శాఖ డీఈ శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి విద్యుత్ సమస్య రాకుండా అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు, అదనంగా రాష్ట్రవ్యాప్తంగా మూడు యూనిట్లలో 2,400 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు వివరించారు. విద్యుత్ సమస్య పరిష్కారంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి ఎంతో ఉందని డీఈ శ్యాం సుందర్ రెడ్డి పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఏడీతో సహా సిబ్బంది మొత్తం నియోజకవర్గంలో విద్యుత్ సమస్య నివారణ కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతోనే సమస్య తీరింది కొందుర్గు రైతు మహేశ్వర్ రెడ్డి వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను తనకు తానుగా గుర్తించి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విద్యుత్ సమస్యను తీర్చడం సంతోషంగా ఉంది. ఈ విషయంలో ఆయన నేరుగా ముఖ్యమంత్రితో మాట్లాడడం, విద్యుత్ సమస్యకు పరిష్కారం చూపడం ఆనందంగా ఉందని కొందుర్గు రైతు మహేశ్వర్ రెడ్డితెలిపారు. పంటకు ప్రాణం పోశారు.. ఎలికట్ట రైతు చిన్న జంగం రాములు పంటలు పూర్తిగా ఎండిపోయే దశలో మూడు గంటల అదనపు విద్యుత్‌తో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదుకున్నారు. దీంతో పంటలకు ప్రాణం వచ్చింది. మా కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని ఎలికట్ట రైతు చిన్న జంగం రాములు అన్నారు. కష్టాలు తెలిసిన ఎమ్మెల్యే మహల్ ఎలికట్ట రైతు పిట్టల బాలయ్య ప్రజల కష్టాలు తెలిసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మరోసారి పంటలు పాడైపోతున్న దశలో ఆదుకోవడం సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రితో నేరుగా మాట్లాడటమే కాకుండా విద్యుత్ శాఖ ఏడీతో కూడా మాట్లాడి సమస్యను పరిష్కరించడం అత్యంత సంతోషకరమని అన్నారు. మా రైతుల కోసం పోరాటం చేస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ వేట వెంకటేశ్వర స్వామి వారి ఆలయ నూతన కమిటీ ఎంపిక

**చైర్మన్ గా.. అజ్మీర బన్సీలాల్**
**వైస్ చైర్మన్ గా... బాబోత్ అర్జున**

గార్ల.. మర్రిగూడెం శ్రీ వేట వెంకటేశ్వర స్వామి వారి ఆలయ నూతన కమిటీ చైర్మన్ గా అజ్మీర బన్సీలాల్, వైస్ చైర్మన్ గా భానోత్ అర్జున, సభ్యులతో పాటుగా నియామకమయ్యారు. శనివారం మండల పరిధి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణం ఎదుట సర్పంచ్ భూక్యరామ్ సింగ్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆలయ ఎండోమెంట్ అధికారి సత్యనారాయణ చేత ఆలయ నూతన కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల తో ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ నూతన కమిటీ సభ్యులుగా మండ సుమత ( బిసి) పల్లె పంగు నాగరాజు (ఎస్సీ), అజ్మీర హరిలాల్ (ఎస్ టి) వల్లభనేని రవి (ఓ,సి) ఎక్స్ ఆఫీసులో సభ్యులుగా రామాయణం రామాచార్యులు నియామకమయ్యారు. ఈ స్వీకరణ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రసంగిస్తూ దసరా పర్వానికి ముందుగానే ప్రమాణ స్వీకరణ మహోత్సవం జరగటం అభినందనీయమన్నారు. స్వామి వారి ఆశీస్సులతో అన్ని రంగాలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఆలయ నూతన కమిటీ సమన్వయంగా భక్తుల సౌకర్యార్థం శ్రీ వేట వెంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో భక్తుల సహకారంతో సౌకర్యాలను పెంపొందించాలన్నారు, నూతనంగా ఎంపికైన కమిటీ వారిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు గంగావత్ రామ్ సింగ్ నాయక్, మర్రిగూడెం పెద్దలు బోజ్జు నాయక్, కోట ఉత్తరయ్య, కుటుంబరావు, సర్పంచ్ వీర్య నాయక్, మాజీ జెడ్పిటిసి ఝూన్సీ లక్ష్మి, పుల్లఖండం రమేష్ బాబు, ఉపేందర్, విశ్రాంత జైన్, గార్ల బయ్యారం సీఐ ఎల్ రవీందర్ యాదవ్, స్థానిక ఎస్సై బి సాయికుమార్ భక్తులు పాల్గొన్నారు.






# తిరుమలగిరి చౌరస్తాలో ప్రైవేటు వాహనాలతో ఆర్టీసీ బస్సులకు ఇబ్బందులు!

### ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం.. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి!

తిరుమలగిరి: సూర్యాపేట జిల్లా తిరుమలగిరి చౌరస్తాలో ప్రైవేటు వాహనాల రాకపోకలు, రహదారిపై వాహనాల నిలుపుదల కారణంగా మోత్కూరు వైపు రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చౌరస్తా వద్ద బస్సులు సక్రమంగా వెళ్లేందుకు తగినంత స్థలం లేకపోవడం, ప్రైవేటు వాహనాలు అడ్డంగా నిలపడం వంటి సమస్యలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. బస్సు ఎక్కాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి! తిరుమలగిరి చౌరస్తా మీదుగా మోత్కూరు, ఇతర ప్రాంతాలకు ప్రయాణించే ప్రజలు ప్రతిరోజూ ఆర్టీసీ బస్సులపై ఆధారపడుతున్నారు. అయితే చౌరస్తా వద్ద ప్రైవేటు వాహనాల వల్ల బస్సులు నిలిచిపోవడం, రాకపోకలకు ఆటంకం కలగడం వంటి పరిస్థితులు ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. ముఖ్యంగా బస్సు ఎక్కేందుకు రహదారిపైకి వెళ్లాల్సి రావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు సహా వివిధ వర్గాల ప్రజలు ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. ఇలాంటి రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ లేకపోతే ప్రయాణికులతో పాటు వాహనదారులకు కూడా ప్రమాదం పొంచి ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.. అధికారులు తక్షణమే స్పందించాలి.. తిరుమలగిరి చౌరస్తాలో నెలకొన్న సమస్యను సంబంధిత అధికారులు తక్షణమే పరిశీలించి, ఆర్టీసీ బస్సులు సజావుగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బస్సులకు అడ్డంకిగా నిలిచే ప్రైవేటు వాహనాల పార్కింగ్‌ను నియంత్రించాలని, అవసరమైన చోట ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తిచేస్తున్నారు.తిరుమలగిరి ఎస్సై కి, నాగారం సిఐ కి ప్రత్యేక విజ్ఞప్తి:ప్రయాణికుల భద్రతను దృష్టిలో గత రెండు రోజుల నుండి సద్దుల బతుకమ్మ దసరా పండుగ సందర్భంగా హైదరాబాదు నుండి తిరుమలగిరికి భారీగా జనం వచ్చిపోవుడు రద్దీగా ఉండడంతో ఇబ్బందులు పెరిగాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు హైవే రోడ్డు పక్కన బస్టాప్లను రిక్వెస్ట్ స్టాపులుగా మార్చే విధంగా ప్రజలకు సౌకర్యాలు కల్పించే విధంగా వారికి షెల్లను వేసి ఉంచాలని రోడ్డుపైన నిలవడం చాలా ప్రమాదాలకు



తావుతీస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు కావున తక్షణమే తిరుమలగిరి మెయిన్ రోడ్డుపై బస్సులు ఆగే రోడ్డుకు ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించే విధంగా రెండు మూడు షెడ్లను రోడ్డు పక్కన వేసి కూర్చోవడానికి కూడా పెద్ద మనుషులు చాలామంది ప్రయాణికులు రావడం జరుగుతుందన్నారు ప్రతిరోజు గంటకు అన్ని మండలాల నుండి హైదరాబాదుకు ఎక్స్ప్రెస్ డీలక్స్ ఆర్డినరీ బ్యాటరీ బస్సులను వాడుకోవడం జరుగుతుందన్నారు కావున ముందు జాగ్రత్త సరిగా ప్రతి ఒక్కరికి సౌకర్యార్థం బస్సు ప్రయాణికులకు ప్రాంగణం ఏర్పాటు చేయాలని పలు మండలాల ప్రజలు కోరుతున్నారు. ఇదేతిరుమలగిరి చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలి. మోత్కూరు వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడటంతో పాటు, ప్రయాణికులు సురక్షితంగా బస్సులు ఎక్కేలా తగిన ఏర్పాట్లు చేయాలి. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేపట్టి, భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం

### నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనిచేయాలి
### రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు ? రంగారెడ్డి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. శనివారం మహబూబ్‌నగర్ పట్టణంలోని బృందావన్ గార్డెన్స్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డికి మద్దతుగా నిర్వహించిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో పాటు రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే మన్నె శ్రీనివాస్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, సంపత్‌కుమార్, శివసేన రెడ్డి, సరితా తిరుపతయ్య, మైనారిటీ చైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ చరిత్రలోనే ఇంత ముందుగా ఎమ్మెల్సీ అభ్యర్థిని ప్రకటించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. అభ్యర్థిని ముందుగానే ప్రకటించడం వెనుక కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వ్యూహాన్ని



నాయకులు, కార్యకర్తలు అర్థం చేసుకోవాలని సూచించారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై రుద్దే ప్రయత్నం చేయడం సరికాదని ఎమ్మెల్యే అన్నారు. దేశ రాజకీయాల్లో మార్పు వస్తోందని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రచయితల సంఘం అధ్యక్షులు గా పెద్దిరెడ్డి గణేష్ ఏకగ్రీవ ఎన్నిక

సూర్యాపేట : 17 అక్టోబర్: సూర్యాపేట లో జరిగిన కవులు రచయితల సమావేశంలో సూర్యాపేట జిల్లా రచయితల సంఘం ఏర్పాటు అయింది. ఇటీవల సూర్యాపేట జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో హుజూర్నగర్, కోదాడ, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గ రచయితల సంఘాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నాలుగు నియోజ కవర్గాల కార్యవర్గాల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న కార్యవర్గ సభ్యులు కవులు రచయి తలు కలిసి శనివారం సుధా బ్యా ంక్‌లో సూర్యాపేట జిల్లా రచ యితల సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రముఖ కవి రచయిత, సాహితీవేత్త పెద్దిరెడ్డి గణేష్ సూర్యాపేట జిల్లా రచయి తల సంఘం అధ్యక్షులుగా, ప్ర ముఖ కవి పిల్లల మరి పినవీ రభద్రం కళాపీఠం వ్యవస్థాపకు లు శీలా అవిలేను ప్రధాన కార్య దర్శిగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. ఈ సంఘానికి జిల్లాలోని సీని యర్ రచయిత ఆలేటి



శంకర్‌ను సంఘం గౌరవఅధ్యక్షులుగా ఎన్నుకు న్నారు.నూతనంగా ఏర్పడిన జిల్లా రచయితల సంఘం గౌరవ సలహా దారులుగా బెల్లంకొండ శ్రీరాములు,గడ్డం నర్సయ్య, తుమ్మరాజా లను నియమించారు. అదేవిధంగాఉపాధ్యక్షులుగా ధర్మారి వెంక టేశ్వర్లు, పుప్పాల కృష్ణమూర్తి,ఎర్ర హరికిషన్,సంయుక్త కార్యదర్శు లుగా గొడితాల వెంకటేశ్వర్లు, వేముల వెంకటేశ్వర్లు,సరికొండ నరసింహారాజు ప్రచార కార్యదర్శిగా పబ్బతి వెంకటేశ్వర్లు,కార్యవర్గ సభ్యులుగా ముక్కామల జానకి రాములు, ఏబెల్ శశి, ఎన్ .సీ. రోజా, పూసోజు పద్మ, పోతుగంటి వీరాచారి, జిల్లేపల్లి జానయ్య, కొర్రపిడత శ్రీనివాస్, లింగాల శ్రీనివాస్, కొండా లింగారావు, తదితరులను ఎన్నుకున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన సూర్యాపేట జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పెద్దిరెడ్డి గణేష్ మాట్లాడుతూ సాహిత్య సాంస్కృతిక రంగంలో కవులు రచయితలను ఒక తాటిపై నడిపి సూర్యాపేట సాహిత్యరంగాన్ని సుసంపన్నం చేస్తామని నూతన వర్తమాన కవులు రచయితలకు ప్రోత్సాహం ఇస్తూ వారి రచనలను వెలుగులోకి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తామన్నారు. తెలుగు భాషను సుసంపన్నం చేసే దిశగా అనేక కార్యక్రమాలు తీసుకుంటామన్నారు. కవిత్వ కార్యశాలలతో పాటు, తెలుగు భాష విస్తృతికి ఉన్నతికి తెలుగు భాషా ఉపాధ్యాయులను కలిసి కృషి చేసేలా ప్రయత్నం చేస్తామని అన్నారు. పాఠశాలల్లో క్షేత్రస్థాయిలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన కవిత్వ,కథా పోటీలు నిర్వహించి ప్రోత్సహిస్తామని సూర్యాపేట జిల్లా రచయితల సంఘం ఆ బాధ్యతను తీసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన అనేకమంది కవులు రచయితలు సాహితీప్రియులు పాల్గొన్నారు.

# దుర్గామాత మండపాల్లో డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత ప్రత్యేక పూజలు

### రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారికి ప్రార్థన



రంగారెడ్డి,అక్టోబర్ 17:దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి శనివారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బాలాపూర్, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజల జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని దుర్గామాతను ప్రార్థించారు. శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిభావంతో, ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్న నేపథ్యంలో అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆకాంక్షించారు.ఈ పూజా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, నిరుడు శ్రీరాములు, రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, గట్టు బాలకృష్ణ, బోయపల్లి వెంకట్ రెడ్డి, దిండు శ్రీనివాస్ గౌడ్, బొల్లపల్లి కుమార్, టేకుల శశిధర్ రెడ్డి, ఎదుల్ల ప్రతాప్ రెడ్డి, రామిడి శ్రీనివాస్ రెడ్డి, తూళ్ళ నరహరి గౌడ్, అమృత నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజా చైతన్య సమితి రంగారెడ్డి జిల్లా కార్మిక సంఘం అధ్యక్షుడిగా వడ్డే వెంకటేష్

### ప్రజలు చైతన్యవంతులైనప్పుడే హక్కుల సాధన సాధ్యం



రంగారెడ్డి, : తెలంగాణ ప్రజా చైతన్య సమితి రంగారెడ్డి జిల్లా కార్మిక సంఘం అధ్యక్షుడిగా వడ్డే వెంకటేష్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రజా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు నర్సింలు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా రాపోలు నర్సింలు మాట్లాడుతూ ప్రజల్లో సామాజిక, హక్కులపట్ల చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు చైతన్యవంతులైనప్పుడే తమ హక్కులను తెలుసుకొని, వాటిని సాధించుకోగలుగుతారని పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాజు, సామ కర్ణాకర్ రెడ్డి, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

printed and published by Rapolu Lingaswamy,onbehalf of printed at SMILYS ONLINE 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana Editor: Rapolu Lingaswamy.pone:9908103501, PRGI NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com